క్లుప్తంగా

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



యువతకు వాలీబాల్ కిట్లు అందజేస్తున్న ఎంపీపీ ఉషారాణి

అరకులోయ రూరల్: అన్ని రంగాల్లో గిరిజన యువత ముందుండాలని అరకులోయ ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. మండలంలో మాడగడ పంచాయతీ బోడుగుడ గ్రామంలో ఆమె సోమవారం పర్యటించారు. స్థానిక యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నర్సింహమూర్తి, అర్జున్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చంద్రబాబు క్షమాపణ చెప్పాలి



మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతను దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేసిన సీఎం చంద్రబాబు ప్రపంచ వ్యాప్తంగా ఉన్న హిందువులకు క్షమాపణ చెప్పాలని అరకులోయ మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ సోమవారం సాయంత్రం అమెరికా నుంచి వీడియో కాల్ చేసి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన వీడియో కాల్‌లో మాట్లాడుతూ కోట్లాది మంది భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా చంద్రబాబు తిరుపతి లడ్డూ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. సుప్రీంకోర్టుని తప్పు దోవ పట్టించేందుకు కుట్ర పనుతున్నారన్నారు. చంద్రబాబు తన కుట్రరాజకీయాలతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఇబ్బందులకు గురిచేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై సుప్రీంకోర్టు జడ్జీలతో విచారణ చేయాలని ఆయన కోరారు.

అనారోగ్యంతో కార్మికుడి మృతి



పోతురాజు దొర (ఫైల్)

మారేడుమిల్లి: మండలంలోని కుడ్రవాడ గ్రామంలోని సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కంగాల పోతు రాజు దొర (35) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. పోతురాజు దొర స్వగ్రామం గంగవరం గ్రామం మారేడుమిల్లి గ్రామంలో నివాశం ఉంటూ, సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన మృతికి సత్యసాయి తాగునీటి పథకం సిబ్బంది, యూనియన్ నాయకులు తదితరులు సంతాపం తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్ కాసులమ్మ తదితరులు

గూడెంకొత్తవీధి: మండలంలోని చెరపల్లిలో నిర్మించనున్న రోడ్డు పనులను సర్పంచ్ వనపల కాసులమ్మ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారుల ఏర్పాటుతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. రహదారి అందుబాటులోకి వస్తే చెరపల్లి పరిసర గ్రామస్తులకు రవాణా కష్టాలు తీరుతాయన్నారు.

ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలి



సీపీఎం జెండావిష్కరణలో నేతలు

ముంచంగిపుట్టు: కర్రిముఖిపుట్టు పంచాయతీ గేదలబంధలో సీపీఎం నాయకుల సమావేశం నిర్వహించారు. ప్రజా సమస్యలపై పోరాటం, కార్యచరణ తదితర అంశాలపై చర్చించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు త్రినాథ్ మాట్లాడుతూ ఆదివాసీ యువత కోసం ప్రభుత్వం ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని, జీవో నెంబర్- 3ను అమలు చేయాలని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. నేతలు జిన్నబంధు, లైకోన్, నారాయణ, శ్రీను, సీతారాం, రఘుపతిబాలభాద్రుడు పాల్గొన్నారు.

- అకాశాన్నంటుతున్న నిత్యావసరాలు, కూరగాయల ధరలు
- అమాంతంగా పెరిగిన నూనె ధరలు
- కిలో టమాటా వంద రూపాయలు
- కృత్రిమ కొరత సృష్టిస్తున్న దళారులు
- పట్టించుకోని అధికారులు

ధరల మోత



అరకులోయ మార్కెట్‌లో విక్రయిస్తున్న కూరగాయలు



అరకులోయటౌన్: అరకులోయ పట్టణంలో నిత్యావసర సరకులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నూనె ధరలు అమాంతంగా పెరిగాయి. మధ్య తరగతి జీవి సగం జీతం మింగేసేలా, ఓ నిరుపేద కుటుంబం ఒక్క పూట కూరకే పరిమితమయ్యేలా ధరలు అకాశం వైపు చూస్తున్నాయి. దీనికి తోడు కొంతమంది వ్యాపారులు, దళారుల కృత్రిమ కొరత వల్ల బజారుకు వెళ్లడానికే భయం పుట్టేలా చేస్తున్నాయి.

వినియోగదారుల గగ్గోలు

మార్కెట్‌లో ధరలు మండిపోతున్నాయి. మునుపెన్నడూ లేనంతగా కూటమి ప్రభుత్వ పాలనలో ఆ ధరలు రెట్టింపయ్యాయి. ధరలు నియంత్రించాల్సిన సంబంధిత శాఖల అధికారులు చోద్యం చూస్తుండడంతో బహిరంగ మార్కెట్‌లో దళారులు, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి, రెట్టింపు కంటే అధిక ధరలకు అమ్మేసుకుంటున్నారు. వాస్తవానికి మన్యంలో పండించే కూరగాయలు, ఆకుకూరల ధరలు మైదాన ప్రాంతాల్లో కంటే తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా టమాటా, క్యాబేజీ, క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్, క్యాలీఫ్లవర్, అల్లం, తోటకూర, బచ్చలికూర తదితర పంటలన్నీ మన్యంలో విస్తారంగా పండిస్తారు. అయితే ఇటీవల దళారుల సిండికేట్ వ్యాపారం జోరుగా ఉంది. ఫలితంగా అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరల ధరలను సిండికేట్ వ్యాపారులు గణనీయంగా పెంచేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా మంచి నూనె లీటరు రూ.145, ఉల్లిపాయ కిలో రూ. 80, టమాటా కిలో రూ.100 మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కందిపప్పు పేదోడికి అందకుండాపోతోంది. ఈ ధరలు సామాన్యులకే కాదు హోటళ్ల నిర్వాహకులను బెదరగొడుతోంది. అలాగే ప్రభుత్వ గిరిజన సంక్షేమ వసతిగృహాలు, గురుకులం వసతి గృహాలు, కేజీబీవీల నిర్వాహకులు ఏం చేయాలో తలలు పట్టుకుంటున్నారు. నిత్యావసర సరుకుల ధరలు, కూరగాయల ధరలు మరింతగా పెరిగాయి. పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని వసతి గృహాల నిర్వహకులు కోరుతున్నారు. గత ప్రభుత్వంలో సామన్య, మధ్యతరగతి, నిరుపేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలకు హాయిగా ఉండేది. కానీ కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వంలో మాటలు తప్పా, చేతలు చూపించకపోవడంతో సామాన్యుడికి కష్టాలు తప్పడంలేదు.

నిత్యావసర వస్తువుల ధరల్లో వ్యత్యాసం

వస్తువులు	జనవరిలో (కిలో) రూ.లలో	అక్టోబర్‌లో (కిలో) రూ.లలో
పసుపు	180	220
కారం	300	350
కందిపప్పు	150	180
పెసరపప్పు	100	130
బఠాణి	60	80
శనగపప్పు	80	110
శనగ పలుకులు	110	150
మినపప్పు	100	140
ఉల్లిపాయలు	40	70
	(1 లీటరు)	(1 లీటరు)
రిఫైండ్ ఆయిల్	120	145
పామాయిల్	90	120

కూరగాయలు

	(కిలో) రూ.లలో	(కిలో) రూ.లలో
టమాటా	50	100
ఉల్లిపాయలు	40	80
అల్లం	80	120
వెల్లుల్లి	240	300
బీరకాయలు	30	50
బెండకాయలు	30	50
బంగాళదుంపలు	30	50

ధరలు నియంత్రించాలి



ధరలు అమాంతంగా పెరగడంతో గంజి మెతుకులతోనే సరిపెట్టుకోవలసి వస్తుంది. నిత్యావసర సరకుల ధరలు అమాంతంగా పెరగడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. గతంలో ఎన్నడూ లేని విధంగా రేట్లు ఇప్పుడు పెరిగాయి. సామాన్యులపై గుది బండలా ఈ ధరలు ఉన్నాయి. ప్రభుత్వం స్పందించి ధరలు నియంత్రించాలి.

– బురిడి సుమిత్ర, గంగగుడ్డి గ్రామం, సుంకరమెట్ట పంచాయతీ

గతంలో లేనంతగా అధిక ధరలు



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ ఇలా నిత్యవసరాల ధరలు పెరగలేదు. ఈ ఏడాది అలా కాదు, ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రజలకు ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చాలి. పేద, సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు కాయగూరల భోజనం కష్టమవుతోంది.

– కిల్లో రాంబాబు, శిమిలిగుడ గ్రామం, అరకులోయ మండలం

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు



భక్తులతో కలిసి పూజలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి

చింతపల్లి: మండల కేంద్రంలోని రంగా సెంటర్‌లో నెలకొల్పిన మండపంలో దుర్గమ్మ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రోజూ ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుపుతున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ విభాగం అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆమెతో పాటు ఎంపీపీ అనూషదేవి, ఎంపీటీసీ సభ్యులు దారలక్ష్మి, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

రాజవొమ్మంగి: గ్రామాల్లో అందుబాటులో ఉన్న ఫీడర్ అంబులెన్స్ వాహనాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మేనేజర్ శ్రీనివాసనాయక్ కోరారు. మండంలోని జడ్డంగి, దోనెపాలెం, అమ్మిరేఖల, కింద్ర గ్రామాల్లోని ఫీడర్ అంబులెన్స్‌ల పనితీరును ఆయన సోమవారం పరిశీలించారు. ఫీడర్ అంబులెన్స్ సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. 108 వాహనాలు వెళ్ళలేని, రోడ్లు సరిగా లేని ప్రాంతాల గిరిజనులు ఈ ఫీడర్ అంబులెన్స్ ఉపయోగపడతాయని, వాటి సేవలను వినియోగించుకోవాలని కోరారు.



జడ్డంగిలో ఫీడర్ అంబులెన్స్ పనితీరు, రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీనివాస్‌నాయక్

74 మందికి వైద్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రంలో కిలగాడ వైద్యాధికారి రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 74 మందికి వైద్య సేవలందించారు. జ్వరాలతో బాధపడుతున్న అయిదుగురికి రక్త పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కంటి పరీక్షలు సైతం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలని, ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు సూచించారు. వైద్య సిబ్బంది లలిత, పుష్ప, కిషోర్, మల్లేశ్వరి, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం

బదిలీపై వెళ్తున్న శాస్త్రవేత్తలకు సత్కారం



శాస్త్రవేత్తలను సన్మానిస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం: పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం కో–ఆర్డినేటర్‌గా పనిచేసిన డాక్టర్ పి.లలితాకామేశ్వరి, శాస్త్రవేత్త డాక్టర్ ఆదర్శలు బదిలీ కావడంతో వారిని సోమవారం ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కెవీకె కో–ఆర్డినేటర్ డాక్టర్ కె.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన వీరికి ఎప్పటికి ఈ ప్రాంతంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. శాస్త్రవేత్తలు కె.వీ రాంజనేయులు, డాక్టర్ క్రాంతికుమార్, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతుల వెల్లువ



మాట్లాడుతున్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి

వై.రామవరం: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బారులో సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. పింఛన్లు, రోడ్ల సమస్యలు, అందని పథకాల వల్ల అవస్థలు తదితర అంశాలపై సుమారు 250 వినతులు వచ్చాయి. కార్యక్రమంలో పాల్గొన్న రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. తహసీల్దార్ కె.అనసూయ, డీటీ సుధాకరరావు. ఈఓపీఆర్‌డీ శివకుమార్, ఏపీవో భాస్కర్, ఏపీఎం సాయిబాబా, ఎంఈవో తాతబ్బాయిదొర, నాయకులు పాల్గొన్నారు.

అధికారుల బాధ్యతల స్వీకరణ



జి.మాడుగులఎంపీడీవో తేజ్‌రతన్‌కు బొకే అందిస్తున్న ఈవోపీఆర్డీ డేవిడ్ తదితరులు



రంపచోడవరం ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్రీనివాసుదొర



అనంతగిరి ఎంపీడీవో ఎ.వి.వి.కుమార్



కూనవరం తహసీల్దార్ కె.శ్రీనివాసరావు

అనంతగిరి(అరకులోయ రూరల్): అనంతగిరి ఎంపీడీవోగా ఎ.వి.వి.కుమార్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్నం జిల్లా పరిషత్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీపై అనంతగిరి ఎంపీడీవోగా వచ్చారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన నగేష్ భీమిలి బదిలీ ఆయ్యారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉండి పూర్తి స్థాయిలో సేవలు అందిస్తాన్నన్నారు.

డుంబ్రిగుడ: డుంబ్రిగుడ ఎంపీడీవోగా ఎం.ప్రేమ్‌సాగర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పశ్చిమ గోదావరి జిల్లా నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఉషారాణి వేరే జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ మండల అభివృద్ధికి ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారుల భాగస్వామంతో కృషి చేస్తానన్నారు.ఆయనకు సిబ్బంది స్వాగతం పలికారు.

జి.మాడుగుల: జి.మాడుగుల ఎంపీడీవో జె.తేజ్‌రతన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీవో లోహిత్ జయసాగర్ కాకినాడ జిల్లాకు బదిలీ అయ్యారు. తేజ్‌రతన్‌కు కార్యాలయ సిబ్బంది బొకేలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రంపచోడవరం: రంపచోడవరం ఎంపీడీవోగా సుందం శ్రీనివాసుదొర సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన బి.హరికృష్ణ కిర్లంపూడి మండలం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీనివాసదొర మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు సమర్ధవంతంగా అమలుచేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆయనకు సిబ్బంది పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

కూనవరం: మండల తహసీల్దార్‌గా కె.శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగ్గంపేట డీటీగా పనిచేస్తున్న ఈయన కూనవరం తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన నాగబాబు పత్తిపాడు మండలం పౌరసరఫరాల డీటీగా బదిలీ అయ్యారు. తహసీల్దార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది సమన్వయంతో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ మండల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని చెప్పారు.

ఉపాధి పనులపై తీర్మానం



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్ హరి

డుంబ్రిగుడ: మండలంలోని కండ్రుంలో పంచాయతీ కేంద్రంలో ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ కె.హరి, వైస్ ఎంపీపీ ఆనంద్‌రావులు మాట్లాడారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మట్టికట్టలు, భూమిచదును, రాతికట్టలు, కందకాలువలు పనుల కోసం తీర్మానించినట్టు చెప్పారు. వైస్ సర్పంచ్ ప్రతిమ, మాజీ సర్పంచ్ కిల్లో ఆనంద్, పంచాయితీ కార్యదర్శి గోవింద్, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాలుజారి వృద్ధుడి మృతి



మృతి చెందిన వృద్ధుడు మోసియా

డుంబ్రిగుడ: మండలంలోని గసభ పంచాయతీ జంగిడివలస గ్రామానికి చెందిన వంతల మోసియా (63) ఆదివారం ఉదయం పశువులను మేతకి తీసుకువెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయి మృతి చెందినట్టు ఎస్ఐ కె.పాపినాయుడు తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మృతుడి కుమారుడు వంతల పెద్దన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాలుజారి పడిపోయిన వ్యక్తికి దవడ భాగంపై గాయమై రక్తమడుగులో పడి ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కొత్తపల్లి జలపాతానికి సొబగులు



కొత్తపల్లి జలపాతం వద్ద ఫ్లోరింగ్ టైల్స్ పనులు



కొత్తపల్లి జలపాతం వద్ద పార్కింగ్ ఏరియా వద్ద రోడ్డు నిర్మాణ పనులు

- చకచకా సుందరీకరణ పనులు

జి.మాడుగుల: మండలంలో గల కొత్తపల్లి జలపాతం సుందరీకరణ పనులు ఊపందుకున్నాయి. ఇటీవల కాలంలో పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ఈ ప్రాంతాన్ని సందర్శించి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. కొత్తపల్లి జలపాతాన్ని పర్యాటకులు ఆకర్షించేలా తీర్చిదిద్దాలని, సీసీ రోడ్డు పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ మేరకు ఆయా పనులను పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో చకచకా జరుగుతున్నాయి. సుందరీకరణలో భాగంగా కొత్తపల్లి జలపాతం పరిసరాల్లో టైల్స్ ఫ్లోరింగ్, ఇనుప రాడ్స్ ఫెన్సింగ్, వాటికి పెయింటింగ్ తదితర పనులు జరుగుతున్నాయి. కొత్తపల్లి జలపాతానికి ప్రధాన రహదారి నుంచి పార్కింగ్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు. జలపాత ప్రాంతాలకు సుందరంగా తయారు చేస్తుండడంతో ఇక్కడకు వచ్చే పర్యాటకులు కొత్త అనుభూతి పొందుతారని కొత్తపల్లి జలపాతం సూపర్‌వైజర్ వంతాల అభి తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



అరకు ఎమ్మెల్యే మత్స్యలింగంనకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎంపీడీవో కుమార్

అరకులోయటౌన్: నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగంను అనంతగిరి మండల ఎంపీడీవో కుమార్ మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కుమార్ మాట్లాడుతూ మండలంలో గతంలో తాను ఇన్‌చార్జీ ఎంపీడీవోగా పనిచేశానని, స్థానిక సమస్యలపై తనకు అవగాహన ఉందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ నాన్‌షెడ్యూల్ ఏరియాలో ఉన్న సమస్యలను ప్రత్యేకంగా దృష్టి సారించి, గిరిజనులకు ఎటువంటి సమస్యలు లేకుండా చూడాలని, గిరిజనులకు ఏమైన సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కులం పేరుతో దూషించిన అధికారిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్

అరకులోయ రూరల్: గిరిజన మహిళ మొస్య సుజాతను కులం పేరుతో దూషించిన పాడేరు విద్యాశాఖ ఏడీ వినయ్‌మోహన్, జూనియర్ అసిస్టెంట్లు విసీల్, వీరబాబులను తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ తన భర్తపై ఉన్న సస్పెన్షన్‌ను ఎత్తివేతపై ఉత్తర్వులు జారీ అయినా అధికారుల జాప్యంపై ఆయా అధికారులను నిలదీయగా, వారు దూషించి అనుచిత వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. దీనిపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారని, విచారణ చేపట్టి తక్షణమే ఆయా అధికారులను కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. నాయకులు బాజ్జిబాబు, నానిబాబు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి, వేదికపై జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

రంపచోడవరం: పంచాయతీలో పాలనపై ఉప సర్పంచ్, వార్డు మెంబర్లు ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం ఎంపీపీ బందం శ్రీదేవి అన్నారు. ఏపీఎస్ఐఆర్‌డీ ఆధ్వర్యంలో ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లుకు గ్రామ పరిపాలన, అభివృద్ధి అంశాలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మిలు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ చట్టం, పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకొని, శిక్షణలో తెలుసుకున్న అంశాలను అమలుచేయాలని కోరారు. ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర, విస్తరణ అధికారి ఎస్.జాన్‌మిల్టన్, వైస్ ఎంపీపీ కొమ్మిశెట్టి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లో ఇసుక మేటలు.. రైతుల కన్నీళ్లు

పెదబయలు: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని 23 గ్రామ పంచాయతీల పరిధిలో వరి పంట తీవ్రంగా నష్టం జరిగింది. మండలంలోని గిన్నెలకోట చామగెడ్డ గ్రామానికి చెందిన లకే రామయ్య ,లకే రాజం దొర మరికొంత మంది రైతులకు చెందిన వరి పొలాలు వరదనీటిలో పూర్తిగా కొట్టుకుపోయాయి. దీంతో పాటు మండలంలోని గోమంగి,గుల్లేలు, లింగేటి, గలగండ, గంపరాయి, పెద కోడాపల్లి, కిముడుపల్లి, కుంతుర్ల, కొరవంగి, రూడకోట, పర్రెడ, జామిగుడ, గిన్నెలకోట.లక్ష్మీపేట, అరడకోట, సీకరి, ఇంజరి పంచాయతీల్లోని పొలాల్లో ఇసుకమేటలు, రాళ్లు దర్శనమిస్తున్నాయి. పొలాలు నష్టపోయిన రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని వారు వేడుకుంటున్నారు.